క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన ఉమా



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఉమా

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఈసీ సభ్యుడు మాదినేని ఉమామహేశ్వరనాయుడు మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశారు. సీఈసీ సభ్యుడిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు ఉమామహేశ్వర నాయుడు పేర్కొన్నారు.

విద్యార్థిని ఆపరేషన్‌కు చేయూత

రాయదుర్గంటౌన్: విద్యార్థిని శస్త్రచికిత్స కోసం మున్సిపల్ ఉపాధ్యాయులు చేయూత అందజేశారు. వివరాలు.. 2023–24లో పట్టణంలోని బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ హైస్కూల్‌లో వైష్ణవి పదో చదువుకుని 585 మార్కులతో మెరుగైన ఫలితాలు సాధించింది. ప్రస్తుతం ఆర్డీటీ సహకారంతో విజయవాడలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. విద్యార్థిని కొంతకాలంగా వెన్నుముక సమస్యతో బాధపడుతోంది. శస్త్రచికిత్స అత్యవసరం కాగా తల్లిదండ్రులు కోయంబత్తూరులోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. స్పందించిన ఉపాధ్యాయులు రూ.40 వేలు విరాళాలు సేకరించి తండ్రి సిద్దేశ్ ఫోన్ పే నెంబర్‌కు పంపించారు. ఆస్పత్రి నుంచి విద్యార్థి వైష్ణవి వీడియో మేసేజ్ ద్వారా ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపింది.

ఘనంగా లలితా దేవి హోమం

ఉరవకొండ: స్థానిక గుంతకల్లు రోడ్డు వద్ద వెలసిన ప్రసిద్ధిగాంచిన జగదీశ్వరీ ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ఆలయ ధర్మకర్త మాతాజీ శ్యామలమ్మ ఆధ్వర్యంలో లలితాదేవి హోమం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేపట్టారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో లలితాదేవి, ఉమామహేశ్వర హోమం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

తక్కువ పెట్టుబడితో లాభాలు సాధించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఉరవకొండ రూరల్: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించే దిశగా రైతులు ముందుకు వెళ్లాలని కేవీకే శాస్త్రవేత్తలు చంద్రాయుడు, మల్లికార్జున, యుగంధర్, బాలాజీ నాయక్, రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ పద్మలత సూచించారు. మంగళవారం రాకెట్ల పొలాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు పప్పుశనగలో అధిక దిగుబడినిచ్చే, తెగుళ్లను తట్టుకునే వివిధ రకాల విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ–పంట నమోదు ఈ నెల 25 వరకు ప్రభుత్వం పొడగించిందని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ సత్యనారాయణ సూచించారు. ఏఓ రామకృష్ణుడు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా తుమ్మల మారెమ్మ జాతర

కళ్యాణదుర్గం: పట్టణంలోని స్థానిక వడ్డే కాలనీలో మంగళవారం జరిగిన తుమ్మల మారెమ్మ జాతరకు మాజీ ఎంపీ, పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. మున్సిపల్ కోఆప్షన్ చల్లా మారుతి ఇంట్లో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయనతో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జహురుద్దీన్ షావలికి ప్రత్యేక ఫాతెహా



జహురుద్దీన్ షావలి సమాధి వద్ద ఫాతెహా పఠిస్తున్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఫైర్‌స్టేషన్ సమీపంలో గొందిబావి ఏరియాలోని పురాతన హజరత్ సయ్యద్ జహురుద్దీన్ షావలి దివ్య సమాధి వద్ద మంగళవారం గ్యార్వీని పురస్కరించుకుని ప్రత్యేక ఫాతెహా పఠించారు. ప్రజలంతా సుఖసంతోషాలు, శాంతి, ఐక్యతతో ఉండాలని దువా చేశారు. ఎంఐఎం అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్, ప్రభుత్వ ఖాజీ సైఫుల్లా, ముజావర్ అల్లా బకాష్, అంజుమన్ కమిటీ సభ్యులు రజాక్, జాకీర్, లడ్డు మహమ్మద్ షఫీ, ఫకృద్దీన్, హస్మత్, మాలిక్, మదార్, చమ్మా అస్లాం, మౌలానా ముజాహిద్ రజా, హాఫీజ్, అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

నీరెళ్లే దారేది?



వర్షం వస్తే రామస్వామి వీధి ఇలా..



కొలిమి వీధిలో మోకాలి లోతు నిలిచిన నీరు

- ఆక్రమణలకు గురైన డ్రెయిన్లు
- అస్తవ్యస్తంగా మురుగునీటి వ్యవస్థ
- చిన్నపాటి వర్షానికే వీధులు జలమయం

రాయదుర్గం: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న రాయదుర్గం వర్షం పడితే చాలు వణికిపోతోంది. పట్టణంలోని ముఖ్యమైన వీధులన్నీ జలమయంగా మారుతున్నాయి. అత్యధిక జనసంచారం కలిగిన లక్ష్మీబజార్‌లోని రాయదుర్గం– అనంతపురం ప్రధాన రహదారి జలదిగ్బంధంలోకి చిక్కుకుంటోంది. ఈ పరిసరాల్లో ఉండే పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలు నీట మునుగుతున్నాయి. కారణం మురుగునీటి కాలువల్లో ఎక్కడికక్కడ అడ్డంకులు.. వర్షం నీరు వెళ్లే ఏర్పాట్లు లేకపోవడం, అంతర్గత డ్రెయిన్ల నుంచి ప్రధాన డ్రెయిన్లలోకి అనుసంధాన మార్గాలు లేకపోవడం.. వెరసి పట్టణాన్ని ముంపు ముంగిట నిలుపుతోంది. పట్టణంలో 32 వార్డులు, 88 వేల జనాభా ఉంది. 18 వార్డు సచివాలయాల పరిధిలో దాదాపు 100 కిలో మీటర్ల మేర డ్రెయినేజీలు నిర్మించారు. విస్తరణకు తగ్గట్టుగా మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి చెందలేదు. అంతర్గత వీధుల నుంచి మధ్యస్థ డ్రెయిన్లలోకి అటు నుంచి ప్రధాన డ్రెయిన్లకు మురుగునీరు చేరాలి. అయితే సరైన ప్రణాళిక లేక అస్తవ్యస్తంగా మారింది.

చినుకు పడితే కునుకు కరువు

చినుకు పడితే చాలు లోతట్టు ప్రాంత వాసులకు కునుకు కరువవుతోంది. పట్టణ పైభాగాన వెలసిన కొండల్లోంచి జలం దిగువకు పరవళ్లు తొక్కుతోంది. శాంతినగర్, నీలకంఠేశ్వరస్వామి, బళ్లారి బస్టాండ్, వినాయక సర్కిల్, మార్కెట్ ఏరియా ఓబుళాచారి రోడ్డు, దాసప్ప రోడ్డు మీదుగా వచ్చే వరద నీరు లోతట్టు ప్రాంతాల్లోని రామస్వామి, కొలిమి వీధి, మధుటాకీస్, దుగ్గిలమ్మ గుడి తదితర ప్రాంతాల్లోని ఇళ్లు, వ్యాపార సముదాయాల్లోకి చేరుతోంది. రెండేళ్ల క్రితం లక్ష్మీబజార్‌లోని వ్యాపార సముదాయాల్లోకి నీరు చేరి రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. రామస్వామివీధిలోని కొన్ని ఇళ్లు సగానికి పైగా నీటిలో ఉండిపోయాయి. ఈ పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలం గడాల్సి వస్తోంది. కొండల్లోంచి వరద నీరు వస్తుండడంతో విషకీటకాలు ఇళ్లలోకి చేరుతున్నాయి.

నిధుల విడుదలపై నిర్లక్ష్యం

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డ్రెయిన్ల విస్తరణతో వరదనీరు నిల్వ లేకుండా బయటకు వెళ్లేలా ప్రణాళికలు చేపట్టింది. దీనికి అవసరమయ్యే రూ.20 కోట్ల నిధులు కేటాయించారు. డీపీఆర్ కూడా తయారు చేయించారు. ఇంతలోనే సాధారణ ఎన్నికలు రావడం.. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో స్తబ్దత నెలకొంది. నిధులు విడుదలపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం చూపుతోందని మున్సిపల్ పాలకపక్షం మండిపడుతోంది.

నిధులు మంజూరు చేయాలి



పట్టణంలో ముంపు సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. చినుకు పడితే చాలు లోతట్టు వాసులకు కునుకు కరువవుతోంది. ఈ సమస్యను గత ప్రభుత్వంలో పలుమార్లు తీసుకెళ్లగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 కోట్ల నిధులు కేటాయిస్తూ జీవో విడుదల చేశారు. దానికి తగ్గట్టుగా డీపీఆర్ కూడా పూర్తిచేయించాం. ఎన్నికలు రావడంతో ప్రక్రియ మందగించింది. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి సమస్యకు పరిష్కారం చూపాలి.

– పొరాళ్ల శిల్ప, మున్సిపల్ చైర్‌పర్సన్, రాయదుర్గం

డీపీఆర్ పంపాం



ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా రూ.50 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. రూ.20 కోట్లతో డ్రెయిన్లు, రూ.30 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపట్టేలా ప్రతిపాదనలు రూపొందించాం. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

బృహత్ ప్రణాళికలో ఇలా డిజైన్ చేయాలి...

కొత్తగా అమల్లోకి తీసుకొచ్చేలా కార్యచరణ చేపట్టిన బృహత్ ప్రణాళికలో డ్రెయిన్ల వ్యవస్థపై అధ్యయనం చేసి భవిష్యత్తు అవసరాలకు అనుణంగా డిజైన్ చేయాలి. ప్రధాన అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లపై చేపట్టిన అక్రమ కట్టడాలపై కొరడా ఝుళిపించాలి. చిన్న డ్రెయిన్లు .. మీడియం డ్రెయిన్లలో కలిసే ప్రాంతాల్లో తేడాలు సరిచేయాలి. పెద్ద, అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో చెత్త, అక్రమ నిర్మాణాలు తొలగించాలి.

భక్తిశ్రద్ధలతో సోమనాథేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఉరవకొండ: పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు స్థానిక ఉరగాద్రి కొండపై వెలసిన బడే సోమనాథేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమం చేపట్టారు. గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులు గవిమఠంలోని గవిసిద్ధేశ్వరుడు, కాశీవిశ్వనాథుడు, మల్లేశ్వరస్వామి, ద్వాదశ లింగాల ఆలయాల చుట్టూ గిరిప్రదక్షిణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విజ్ఞాపన సభ జయప్రదం చేయండి

రాయదురంటౌన్: 1998 ఎంటీఎస్ బ్యాచ్ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 11న విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న విజ్ఞాపన సభను జయప్రదం చేయాలని కిశోర్‌కుమార్, గోపాల్‌నాయుడు, వెంకటేశులు తదితరులు కోరారు. విజ్ఞాపన సభ పోస్టర్లను మంగళవారం రాయదుర్గంలో విడుదల చేశారు. మానవతా దృక్పథంతో ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయడం, పదవీ విరమణ పొందిన వారికి కనీస పెన్షన్ వసతి, ఈహెచ్‌ఎస్‌కు అర్హత కల్పించడం, పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ న్యాయం చేయాలన్నారు.

పాడి సంపదను కాపాడుకోవాలి



పాడి పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశు వైద్యులు

కళ్యాణదుర్గం: రాష్ట్రీయ గోకుల్ మిషన్లో భాగంగా మంగళవారం మండలంలోని మల్లిపల్లిలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఏ ఏడీ డాక్టర్ జి.వెంకటేష్, కళ్యాణదుర్గం ఏడీ ఏవీహెచ్ డాక్టర్ రామన్, కణేకల్లు ఏడీ ఏవీహెచ్ డాక్టర్ శైలజ, శెట్టూరు ఏడీ ఏవీహెచ్ డాక్టర్ నాగలింగేశ్వరరెడ్డి హాజరై పాడి రైతులకు పలు విషయాలు తెలియజేశారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ రాయలసీమ ప్రాజెక్ట్ కింద ఉచిత లింగ నిర్ధారణ, వీర్యం ప్రయోజనాలు, ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు.

బన్ని మహంకాళి ఆలయం వద్ద అన్నదానం

రాయదుర్గంటౌన్: స్థానిక కోర్టు సమీపంలోని బన్నీ మహంకాళి ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏటా దసరా అనంతరం భక్తుల విరాళాలతో భక్తమండలి ఆధ్వర్యంలో అన్నదాన నిర్వహించడం ఆనవాయితీ. అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్లు గౌని లావణ్య, శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, వార్డు ఇన్‌చార్జ్ గౌని శ్రీరామిరెడ్డి ప్రారంభించారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ వారి ఆశీస్సులతో ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటం వద్ద పూజల్లో పాల్గొన్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ శ్రేణులు



వజ్రకరూరు మండలం కొనకొండ్లలో వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న వై.భీమిరెడ్డి



రాయదుర్గంలోని పైతోటలో వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్లు

కళ్యాణదుర్గం/ఉరవకొండ/ విడపనకల్లు/ బెళుగుప్ప/వజ్రకరూరు/కూడేరు/బ్రహ్మసముద్రం: వాల్మీకి మహర్షి జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య సూచించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం (సరోజా కాంపౌండ్)లో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రంగయ్య మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి మానవతా విలువలు నేర్పిన మహనీయుడు వాల్మీకి అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, కౌన్సిలర్లు తిరుమల వెంకటేశులు, లక్ష్మన్న, పరమేశ్వరప్ప, కళ్యాణదుర్గం టౌన్, రూరల్, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్లు సుధీర్, గోళ్ల సూరి, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎస్ రాయుడు, పార్టీ అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, పలు విభాగాల రాష్ట్ర కార్యదర్శులు నరేంద్రరెడ్డి, రామాంజనేయులు యాదవ్, మహిళా విభాగం తాలూకా అధ్యక్షురాలు నాగలక్ష్మి, లీగల్ సెల్ రామాంజినేయులు, బూత్ విభాగం తిప్పేస్వామి, యూత్ విభాగం చరణ్, చిరంజీవి, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు దొడగట్ట మురళి, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం బీసీ సెల్ అధ్యక్షుడు మోహన్, మంజు, విజయ్, కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి బేరీల రాజు, దేవ, చటాకుల రామాంజిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

- ఉరవకొండ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆర్టీసీ వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకుల ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు బండారు రాజేష్, జయరాం, సుమంగళమ్మ, లక్ష్మీనారాయణ, వెంకటేశులు, చంద్రశేఖర్, బస్టాండు షాపుసముదాయల యూనియన్ అధ్యక్షుడు పందికుంట శ్రీకాంత్ పాల్గొన్నారు.

వజ్రకరూరు మండలం కొనకొండ్లలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా వాల్మీకి విగ్రహానికి ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాల్మీకి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు లాలెప్ప, రామాంజినేయులు, వాల్మీకి సంఘం నాయకులు సంజప్ప, కొత్తపల్లి శివ, మలాపురం కాశి, సుంకన్న, కొత్తపల్లి రాము, భాస్కర్, చిరంజీవి, నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో వాల్మీకి సంఘం నేతలు వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ఊరేగించారు. ఎస్‌ఐ నాగస్వామి, వాల్మీకి సంఘం మండలాధ్యక్షుడు రాకెట్ల శ్రీరాములు, వాల్మీకి యువసేన తాలుకా కార్యదర్శి డిష్ సురేష్, వాల్మీకి సంఘంనాయకులు పాల్గొన్నారు. అలాగే విడపనకల్లు, బెళుగుప్ప, కూడేరు, బ్రహ్మసముద్రం మండలాల్లో వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకులు ఘనంగా నిర్వహించారు.

వాడవాడలా వేడుకలు



రాయదుర్గం పట్టణంలో వాల్మీకి మహర్షి చిత్రపటం ఊరేగిస్తున్న దృశ్యం



ఉరవకొండలో వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న ఆర్టీసీ వాల్మీకి ఉద్యోగులు



ఉద్దేహాళ్‌లో వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు



అంబాపురంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న వాల్మీకులు

రాయదుర్గంటౌన్/బొమ్మనహాల్/గుమ్మఘట్ట/కణేకల్లు: రాయదుర్గం పట్టణంలో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే కోట మారెమ్మగుడి వద్ద నిర్మించిన మహర్షి వాల్మీకి కల్యాణ మండప ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ వాల్మీకి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండి కిష్టప్ప ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు ముఖ్య అతిథి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. అలాగే పట్టణంలోని 20వ వార్డు పైతోటలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పతో పాటు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు. మహర్షి వాల్మీకి విగ్రహానికి పూజలు చేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, కౌన్సిలర్లు పైతోట సంజీవప్ప, శ్రీలక్ష్మి, గౌని లావణ్య, పొరాళ్ల గోవిందరాజులు, శివపుత్ర, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, వార్డు ఇన్‌చార్జ్‌లు గౌని శ్రీరామిరెడ్డి, రామాంజనేయులు, గోల్డ్ ఇస్మాయిల్, గోనబావి నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బొమ్మనహాళ్ తహసీల్దార్ కార్యాలయంతోపాటు ఉద్దేహాళ్, గోవిందవాడ, , హరేసముద్రం, ఉప్పరహాళ్, నేమకల్లు తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా గుమ్మఘట్ట మండలంలోని బేలోడు, గొల్లపల్లి, భూపసముద్రం, పూలకుంట, గోనబావి, 75వీరాపురం గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకులు నిర్వహించారు. అదేవిధంగా కణేకల్లు మండలంలోని కణేకల్లు, అంబాపురం, జక్కలవడికి, యర్రగుంట తదితర గ్రామాల్లో మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు అంబాపురంలో జాతీయ మానవహక్కుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 65 మంది రక్తదానం చేశారు.

నేడు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

రాయదుర్గంటౌన్: మండలంలోని జుంజురాంపల్లి, మల్కాపురం గ్రామాల్లో నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం 5 గంటలకు 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ జి.రామాంజనేయులు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, అనుబంధన సంఘాల నాయకులు, నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

'సీజేఏపై దాడి అమానుషం'

రాయదుర్గంటౌన్: సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై మతోన్మాది దాడి చేయడం అమానుషం, రాజ్యాంగ విరుద్ధమని ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్, రాయదుర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు జయచంద్రబాబు, కిరణ్‌కుమార్ మంగళవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. న్యాయస్థానంలోనే న్యాయమూర్తి దాడి హేయమైన చర్య అన్నారు. ఇది ముమ్మాటికి ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదని, భారత రాజ్యాంగం, దేశంపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఊరట



మాట్లాడుతున్న జిల్లా వాణిజ్య పన్నులశాఖ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి

రాయదుర్గంటౌన్/బొమ్మనహాళ్: జీఎస్టీ 2.0తో పేదలకు ఊరట కలుగుతుందని జిల్లా వాణిజ్య పన్నులశాఖ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉత్పాదక పన్ను తగ్గడంతో వస్తువులు ధరలు అదుపులోకి వస్తాయన్నారు. తద్వారా మధ్య తరగతి వినియోగదారులకు ఊరట లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడేట్లు పాల్గొన్నారు. అలాగే బొమ్మనహాళ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జీఎస్టీపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశామని ఎంపీడీఓ విజయభాస్కర్, ఎంఈఓ మల్లికార్జున తెలిపారు.

కూడేరు: మరుట్ల–2 కాలనీ, కూడేరు, కేజీబీవీ, కమ్మూరు, కొర్రకోడు, జల్లిపల్లి, కరుట్లపల్లిలోని హైస్కూళ్లలో మంగళవారం విద్యార్థులకు అధికారులు జీఎస్టీ తగ్గింపుతో కలిగే లబ్ధిపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కూడేరు హైస్కూల్‌లో జరుగుతున్న పోటీలను ఎంఈఓ–2 సాయి కృష్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్‌పై పట్టణంలోని స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హర్షలత మాట్లాడుతూ జీఎస్టీ 2.0తో సాధారణ, మధ్య తరగతి ప్రజలు వాడే నిత్యావసర వస్తువులు, వ్యవసాయ, జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై పన్ను రేట్లు తగ్గడం వల్ల వినియోగ సామర్థ్యం పెరుగుతుందన్నారు.

సంక్షిప్త సమాచారం

14న వరి వేలం

కణేకల్లు: కణేకల్లు వ్యవసాయ విత్తనోత్పత్తిక్షేత్రం పరిధిలోని ఎస్ఎస్ఎంఎఫ్ ఫాంలో గత రబీ సీజనల్‌లో సాగు చేసిన వరిలో రిజక్షన్ అయిన విత్తన వరి ఆర్ఎన్ఆర్–15046 రకం (145 క్వింటాళ్లు) ఈనెల 14న బహిరంగ వేలం వేయనున్నట్లు ఏడీఏ నారాయణనాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాగు చేసిన విత్తన వరిని ప్రాసెస్ చేయగా 145 క్వింటాళ్లు తిరస్కరణ అయ్యిందన్నారు. ఏడీఏ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం వేస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు అసిస్టెంట్ డైరెక్టర్, ఫాం ఎస్ఎస్ఎంఎఫ్ సేల్స్ ప్రొసీడ్స్ పేరున రూ.50 వేలు డీడీ తీయాలన్నారు.

9 నుంచి 13 వరకు ఏపీజీబీ సేవల్లో అంతరాయం

కూడేరు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుల్లో ఈ నెల 9న సాయంత్రం నుంచి 13 ఉదయం 10 గంటలకు వరకూ అన్ని సేవల్లో అంతరాయం ఉంటుందని కూడేరు బ్యాంక్ మేనేజర్ రవికుమార్ మంగళవారం తెలిపారు. గ్రామీణ బ్యాంకుల విలీన సందర్భంలో కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ అనుసంధానంలో జరిగే సాంకేతిక ప్రక్రియ కారణంగా సేవల్లో అంతరాయంకల్గుతుందన్నారు. ఖాతాదారులు గమనించాలన్నారు.

దంత సంరక్షణపై జాగ్రత్త వహించాలి

ఉరవకొండ: విద్యార్థులు దంత సంరక్షణపై జాగ్రత్త వహించాలని ఉరవకొండ దంత వైద్య నిపుణులు డాక్టర్ హర్షవర్దన్ సూచించారు. ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్వర్యంలో మంగళవారం రేణుమాకుపల్లి యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా 155 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి బ్రెష్‌లు, టూత్‌పేస్ట్ అందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రీజనల్ చైర్మెన్ టి.గణేష్‌బాబు, పాఠశాల హెచ్ఎం భాస్కర్ లయన్స్ సభ్యులు వేదమూర్తి, నాగేశ్వరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

కూడేరు: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి రైతులు, కూలీలకు సూచించారు. మంగళవారం కూడేరు సచివాలయంలో ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జాబ్ కార్డు కల్గిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. పనులు ఎక్కడ కల్పిస్తే అనువుగా ఉంటాయో సూచనలు ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు. సర్పంచ్ లలితమ్మ, ఏపీఓ పోలేరయ్య, ఇంజినీర్ రాజేష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని వివిధ మఠాల పీఠాధిపతులు పిలుపునిచ్చారు. గంజికుంట గ్రామంలోని ఉమామహేశ్వర గురుపీఠంలో మూడు రోజులుగా జరుగుతున్న శివస్వరూపానందగిరి గురువరస్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రణవానందగిరి గురుస్వామి, కరిబసవరాజేంద్ర మహాస్వామి, గురుచరణానందగిరి మాతాజీ, వాసుదేవానంద సరస్వతిస్వామి, శివానందస్వామి, గురుసేవానంద స్వామి, అభినవశంకరానందస్వామి, శివానందమాతాజీ, మహేశ్వరానందగురుస్వామి, మహేశ్వరానందగురుస్వామి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఆశ్రమ ధర్మకర్త మఠం ఉమాదేవి, ఆశ్రమ భక్తమండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.